క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పాటూరును సన్మానించిన జూపూడి



మచిలీపట్నంటౌన్: మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్యను రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు శనివారం సన్మానించారు. మచిలీపట్నం విచ్చేసిన జూపూడి ప్రభాకరరావును స్థానిక ఆర్అండ్బీ అతిథిగృహంలో కలిసిన మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య కలవగా ఆయన రామయ్యకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నాలుగుసార్లు నిడుమోలు ఎమ్మెల్యేగా పనిచేసిన పాటూరు రామయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు గూడూరు పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకారం

గూడూరు: గూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన కారుమంచి కామేశ్వరరావు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరులోని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఆకుమర్రులోని గ్రామ పార్టీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ముఖ్యఅతిథులుగా హాజరయ్యే ర్యాలీ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అవుతుందని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షికోత్సవం

కోనేరుసెంటర్: బందరు మండలం పెదకరగ్రహారం గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ దంపతులు శీలం భారతి, బాబ్జి పీటల పై కూర్చొని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొర్రా నటేష్ బాబు పీటలపై కూర్చున్న దంపతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మట్టా నాగరాజు, కట్టా పాండురంగారావు, పరసా మహాలక్ష్మి, పరసా నిరీక్షణ రావు, నూకల రాధాకృష్ణ, యక్కల కోటేశ్వర రావు భక్తులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో సుబ్రహ్మణ్య హవనం

మోపిదేవి: లోకకల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య హవనం నిర్వహించినట్లు ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మ, ఆలయ వేద పండితుడు కొమ్మూరి ఫణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి సమీపంలోని కల్యాణ మండపంలో శమీవృక్ష పూజ నిర్వహించారు. అనంతరం స్వామివార్లను మయూర వాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం కొనసాగింది. దారి పొడవునా భక్తులు స్వామివారికి పండ్లు, టెంకాయలు, కానుకలు అందించి ఆశీస్సులు అందుకున్నారు.

రేపు మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష సమావేశం

కృత్తివెన్ను: కృత్తివెన్నులో ప్రసిద్ధిగాంచిన శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానం వద్ద జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7 నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై తహసీల్దార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు హాజరుకావాలన్నారు.

పెడనలో పట్టపగలు చోరీ

పెడన: పట్టణంలోని మూడో వార్డుకు చెందిన బొడ్డు సూర్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 15వ తేదీ స్థానిక శ్రీభద్రావతి సమేత శ్రీభావనారుషి ఆలయంలో జరిగే కల్యాణ మహోత్సవ సంబరాలకు హాజరయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న సుమారు రూ.40 వేల విలువ గల 20 గ్రాముల గొలుసు, ఉంగరం, చెవిదిద్దులు, వాటితో పాటు రూ.15వేలు నగదు అపహరించారు.బాధితుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- నగర పాలక సంస్థ అత్యవసర సమావేశంలో మేయర్ వెంకటేశ్వరమ్మ
- అత్యవసర సమావేశంలో 10, టేబుల్ అజెండాలో 46 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదలను ఆదుకునేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా పేరొందారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నూతన కౌన్సిల్ హాలులో శనివారం మేయర్ అధ్యక్షతన నగర పాలక సంస్థ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నవరత్న పథకాలతో పేదలకు పలు సంక్షేమ పథకాలను అందిస్తూ వారి ఆర్థిక పరిస్థితులను సీఎం జగన్ మెరుగుపరిచారన్నారు. ఇటీవల వైఎస్సార్ ఆసరా పథకం నాల్గవ విడత ద్వారా నగరంలోని 2,494 సంఘాలకు చెందిన 22,116 మంది లబ్ధిదారులకు రూ.10.19 కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. 3,812 మంది చిరు వ్యాపారులకు రూ.3.81 కోట్ల చేదోడు పథకం ద్వారా లబ్ధి చేకూర్చారన్నారు. నగరంలోని 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున సాయం అందిస్తున్నారన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరాకు ఢోకా లేదు

ఉదయం జరిగిన అత్యవసర సమావేశంలో 10 అంశాలకు సమావేశం ఆమోదం తెలిపి సమావేశాన్ని మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సమావేశంలో 46 అంశాలతో కూడిన టేబుల్ అజెండాపై చర్చించి ఆమోదం తెలిపారు. టేబుల్ అజెండాలో 46 అంశాలు పెడితే తాము ఎప్పుడు చదువుకోవాలి, వీటిపై ఎలా స్పందించాలని టీడీపీ సభ్యులు మేయర్‌కు డీసెంట్ నోటీసును అందజేశారు. సభ ప్రారంభం కాగానే వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న వచ్చే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఎలాంటి ప్రణాళిక చేశారో సభకు తెలపాలని ఏఈ సాయిప్రసాద్‌ను కోరగా, నగరంలో రోజు విడిచి రోజు నీటి సరఫరాకు అవసరమైన నీటి నిల్వలు తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, పుట్టమ్మ చెరువుల్లో ఉన్నాయని ఏఈ చెప్పారు. 3,300 మిలియన్ లీటర్ల నీరు ఉందన్నారు. ఈ నీరు 71 రోజుల పాటు అంటే ఏప్రిల్ 26వ తేదీ వరకు సరఫరాకు సరిపోతాయన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో కాలువల ద్వారా నీరు వస్తుందని, దీంతో నగర ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా జరుగుతుందన్నారు. టీడీపీ సభ్యులు దేవరపల్లి అనిత, సమతా కీర్తి మాట్లాడుతూ ప్రతిరోజు తాగునీటి సరఫరా చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. సుబ్బన్న బదులిస్తూ నగరాన్ని రెండు జోన్లుగా విభజించి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారన్నారు. వైద్య కళాశాల, కృష్ణా యూనివర్సిటీ నూతన జగనన్న కాలనీల్లోని 26 వేల ఇళ్లకు నీటిని ఇవ్వాల్సి ఉన్నందున రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నామని వివరించారు. సమావేశంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలుద్దాం

ఉప్పాల రాము, హారిక దంపతులు



నందిగామ గ్రామంలో పర్యటిస్తున్న ఉప్పాల రాము, హారిక దంపతులు

పెడన: పేద ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి మళ్లీ సీఎంను చేసుకుందామని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము), జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. పెడన మండలంలోని నందిగామ, దావోజిపాలెం, దిరిశవల్లి గ్రామాల్లో ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వారు విస్తృతంగా పర్యటించి ఫ్యాను గుర్తుకు ఓటేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా వీరు ఇంటింటికీ తిరుగుతూ ఆయా కుటుంబ సభ్యులను, ఇంటి పెద్దలను కలిసి వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, నవరత్నాల గురించి వివరించారు. కరపత్రాలను అందజేస్తూ జగనన్న ముఖ్యమంత్రిగా మళ్లీ ఎందుకు కావాలో అవగాహన కల్పించారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే మనకు నవరత్నాలు తిరిగి అందుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, అచ్యుతరావు, వెంకట రామానాయుడు, దావు భైరవలింగం, పామర్తి సుబ్రమణ్యం, కటికల జోజిబాబు, జన్ను నాగమల్లేశ్వరరావు, బొడ్డు హరిబాబు, యర్రంశెట్టి మహాలక్ష్మయ్య, బాబి, ఉయ్యూరు బాలాజీ, పామర్తి సుబ్రమణ్యం, జన్ను వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి ఆర్థికసాయం

బండికోళ్లంక(మోపిదేవి): మండలంలోని బండికోళ్ల లంకకు చెందిన బండికోళ్ల సుబ్బారావుకు శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ.6 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల తాటిచెట్టుపై నుంచి ప్రమాద వశాత్తు కింద పడిపోవడంతో కాలు రెండుచోట్ల విరిగింది. విషయం తెలుసుకున్న శ్యామ్‌కిషోర్ నాయుడు క్షతగాత్రుడి ఇంటికి వెళ్లి మానవతాదృక్పథంతో ఆర్థిక సాయం అందించారు.

వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించండి

రావివారిపాలెం(మోపిదేవి): కుప్పకూలిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి తక్షణం అంచనాలు రూపొందించాలని గ్రామ సచివాలయ ఇంజినీర్ ఫణికుమార్‌కు ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని రావివారిపాలెంలో 11/1 కాలువ వంతెనపై శుక్రవారం అధిక ఇసుక లోడ్‌తో వాహనం వెళ్లడంతో వంతెన కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. కాలువ దిగువనున్న ఆయకట్టు ప్రాంత రైతులు ఈ సమస్యను ఎంపీడీఓకు వివరించి, వెంటనే వంతెన నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. దీంతో శనివారం ఎంపీడీఓ అధికారులతో ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటుకు వినతి

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు స్టేషన్ మాస్టర్ పి.నాగేశ్వరరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు మారే సందర్భంలో దివ్యాంగులు, వృద్ధులు, పిల్లలు, లగేజీలతో వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, శివ, శ్రీను, రవి, రాధాకృష్ణ ఉన్నారు.

అపరాల సాగులో మెలకువలపై అవగాహన

కోడూరు: అపరాల సాగులో అధిక దిగుబడి సాధించేందుకు రైతులు మెలకువలు పాటించాలని ఇండోలైఫ్ కంపెనీ స్టేట్ హెడ్ మనోహర్‌రెడ్డి అన్నారు. కృష్ణాపురం వంతెన సమీపంలో శనివారం రాత్రి అపరాల సాగులో అనుసరించాల్సిన విధానాలను వివరిస్తూ ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పంటకు సోకే వివిధ రకాల వైరస్‌లు, తెగుళ్ల గురించి ప్రొజెక్టర్‌పై అవగాహన కల్పించారు.

ఏకాగ్రత, సమయస్ఫూర్తి అవసరం

- రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు దేవానందరెడ్డి
- పది పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు దిశానిర్దేశం



పబ్లిక్ పరీక్షల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దేవానందరెడ్డి

పెడన: పది పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏకాగ్రత, సమయస్ఫూర్తి చాలా అవసరమని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్(అప్స) ఆధ్వర్యంలో శనివారం స్థానిక పల్లోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన సదస్సు, అప్స నూతన కార్యవర్గం అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠాలు బోధించే సమయంలో వారు ఏం చెబుతున్నారనే దానిపై శ్రద్ధ పెట్టాలన్నారు. స్టడీ అవర్స్‌పై ప్రధానంగా ఏకాగ్రత ముఖ్యమన్నారు. వినడం, చదవడం, చదివిన దానిని మననం చేసుకోవడం, మననం చేసుకున్న దానిని రాయడం, రాసిన దానిని మైండ్‌లో ఉంచుకోవడం వల్ల గుర్తుంటాయన్నారు. మనం నేర్చుకున్న దానిని పదిమందికి తెలియజేయడం లేదా చెప్పడం వల్ల సబ్జెక్టు మరింత గుర్తుంటుందని చెప్పారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరై బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయాలని సూచించారు. సమయం ఉంటే అదనంగా ఉన్న ప్రశ్నలకు కూడా సమాధానాలు రాయాలని తెలిపారు. ఒత్తిడికి ప్రధాన కారణాలు నిద్ర పోకపోవడం, సరైన ఆహారం సమయానికి తినకపోవడమేనన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ కష్టంగా కాకుండా ఇష్టంగా ఆసక్తితో చదివి, పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులతో ఆయా సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డైరెక్టర్ దేవానందరెడ్డిని అప్స నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్స రాష్ట్ర నాయకులు వి.సుందరరామ్, కొమరగిరి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు ఎ.గౌరీప్రసాద్, స్థానిక నాయకులు దిలీప్‌కుమార్, ప్రభాకర్, మోహనరావు, పెడన ఎంఈవో-1, 2లు దుర్గాప్రసాద్, హరనాథ్, పల్లోటి స్కూలు ఇన్‌చార్జి కరస్పాండెంట్ మర్రెడ్డి, ప్రిన్సిపాల్ రాజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నతంగా ఎదగాలి

చల్లపల్లి: పేద కుటుంబాల్లోని విద్యార్థులు ప్రతిభావంతులై ఉన్నతంగా ఎదగాలని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్ 92వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యా, క్రీడా విషయక ప్రతిభావంతులకు అతిథులచే బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విశ్రాంత వీఆర్వో అరజా వెంకటేశ్వరరావు, ఎంఈఓ-1 జీఎస్‌టీ గోపాల్, ఎంఈఓ-2 పి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎస్.సుదర్శన ప్రసాద్, ఇన్‌చార్జి తుమ్మల రేణు ప్రసాద్, పురిటిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేబీఎస్ శర్మ పాల్గొన్నారు.

వలంటీర్‌ల సేవలు నిరుపమానం

బందరు శాసనసభ్యుడు పేర్ని నాని



వలంటీర్‌లను అభినందిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే పేర్ని నాని, పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రాష్ట్రంలో వలంటీర్‌ల సేవలు నిరుపమానమని బందరు శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) కొనియాడారు. మచిలీపట్నం మార్కెట్‌యార్డులో శనివారం వలంటీర్ల సేవా పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలను అందించిన వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. కరోనా వంటి కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలను మరువలేమన్నారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయటంలో, సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందజేయటంలో వలంటీర్ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు మాట్లాడుతూ వలంటీర్‌లంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైనికులు అని అన్నారు. అనంతరం వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్‌లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్‌లు వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్, మేకల సుధాకర్‌బాబు, శీలం మారుతీరావు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, బందరు ఆర్డీవో ఎం.వాణి, మునిసిపల్ మాజీ చైర్మన్ సిలార్ దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అచ్చేబా, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కార్పొరేటర్‌లు, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఏడు గొర్రెలు మృతి



రామానగరం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలో శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. మచిలీపట్నం వైపు నుంచి వస్తున్న టిప్పర్ లారీ రామానగరం శ్మశానం వద్ద రోడ్డుపై నుంచి వెళుతున్న గొర్రెల మంద పైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాయి. మరో నాలుగు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డకు చెందిన గొర్రెల కాపరి డొక్కు కృష్ణకు చెందిన గొర్రెలు ఈ ప్రమాదంలో చనిపోయి రూ.లక్షన్నర నష్టం వాటిల్లింది. గొర్రెల మరణానికి కారకుడైన టిప్పర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సీహెచ్ చినబాబు ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 18న జిల్లాలో పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, ఎన్నికలు తదితర అంశాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగే సిల్వర్‌జూబ్లీ వేడుకలకు గవర్నర్ హాజరుకానున్నారన్నారు. ఉదయం 9.45 గంటలకు విజయవాడ రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11:15 గంటలకు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల చేరుకుంటారన్నారు. అనంతరం 12.25 గంటలకు ఇంజినీరింగ్ కళాశాల నుంచి బయలుదేరి విజయవాడ రాజభవన్‌కు వెళ్తారన్నారు. గవర్నర్ పర్యటించే మార్గంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఇళ్ల స్థలాల విషయంపై మాట్లాడుతూ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు సరాసరిన 70 శాతం పూర్తయిందని, వచ్చే రెండు రోజుల్లో మిగిలిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8 క్లయిమ్‌లను అన్ని విధాలా విచారించి సత్వరమే పరిష్కరించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్డీవో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- సాలెంపాలెం, పిట్టల్లంక సచివాలయాలు ప్రారంభం



పిట్టల్లంక సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పిట్టల్లంక, సాలెంపాలెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రెండు సచివాలయాల భవనాలను రమేష్‌బాబు శనివారం ప్రారంభించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రమేష్‌బాబు మాట్లాడుతూ సీఎం జగన్ గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తూ గ్రామస్థాయిలోనే ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు అందేలా సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

రూ.87.2 లక్షలతో అభివృద్ధి పనులు

రూ.87.2 లక్షల అంచనాతో నిర్మించిన పిట్టల్లంక, సాలెంపాలెం సచివాలయాలను రమేష్‌బాబు ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాలను ఆవిష్కరించి, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పలు సూచనలిచ్చారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇంకొల్లు శేషగిరిరావు, పులేంద్రరరావు, గోపి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, గందు నాంచారమ్మ పాల్గొన్నారు.

సింధు స్నానాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష
- 'హంసలదీవి స్పెషల్' పేరుతో ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు
- సాగరసంగమం వద్ద స్నానాలకు అనుమతి నిరాకరణ



సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కోడూరు: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని హంసలదీవి సాగరతీరంలో సింధుస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఈ నెల 24న జరిగే సింధుస్నానాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సముద్ర స్నానాలు ఆచరించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, వీరికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సాగర సంగమం ప్రాంతం వద్ద ఈ ఏడాది భక్తులను అనుమతించడం లేదని అవనిగడ్డ సీఐ త్రినాథ్ తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 200 మంది పోలీసులు, ఆరుగురు ఎస్ఐలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. వన్‌వే ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తామని చెప్పారు. ఈ నెల 23,24,25 తేదీల్లో అవనిగడ్డ డిపో నుంచి హంసలదీవి స్పెషల్ పేరుతో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు డిపో అధికారులు తెలిపారు. విజయవాడ, మచిలీపట్నం, అవనిగడ్డ డిపోల నుంచి 15 బస్సులను హంసలదీవి వరకు నడుపుతున్నట్లు చెప్పారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల తరఫున ఏర్పాట్ల గురించి వివరించారు. సమావేశంలో టీటీడీ వేద పాఠశాల ప్రిన్సిపాల్, వేణుగోపాలస్వామివారి ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, సర్పంచి భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనం కోసమే నూతన ఆవిష్కరణలు

కేయూ ప్రొఫెసర్ పీవీ బ్రహ్మాచారి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బ్రహ్మాచారి

మచిలీపట్నంటౌన్: మానవులు మెరుగైన జీవనం కొనసాగించేందుకు ఆనాటి నుంచి నేటి వరకు నూతన ఆవిష్కరణలు కొనసాగుతున్నాయని కృష్ణా యూనివర్సిటీ మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పీవీ బ్రహ్మాచారి అన్నారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో నూతన ఆవిష్కరణలతో మానవ జీవితంలో వచ్చిన మార్పులు అనే అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు జరిగిన పలు ఆవిష్కరణల కారణంగా మానవ జీవన మనుగడలో మార్పులు వచ్చాయన్నారు. ఈ మార్పులపై విద్యార్థులకు ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్, పీజీటీ జె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

- భూముల గుర్తింపు చర్యలు వేగవంతం చేయాలి
- ఆర్డీవోలను ఆదేశించిన కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పథకం కింద భూమి గుర్తింపు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి హౌసింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇప్పటివరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పథకానికి తీసుకున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పథకం కింద ఇప్పటివరకు 258 దరఖాస్తులు అందాయన్నారు. సమాచార శాఖ కమిషనర్ కార్యాలయ ప్రాథమిక స్క్రూటినీ, ఆయా మండల తహసీల్దార్ల క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం అర్హుల జాబితా రూపొందించారన్నారు. ఆయా మండలాల్లో ప్రభుత్వ భూముల లభ్యత గురించి కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేని చోట్ల ప్రైవేటు భూములు కొనుగోలుకు, ఆయా ప్రాంతాల్లో భూముల ధరలను బట్టి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జగనన్న లేఅవుట్లలో ప్లాటులు అందుబాటులో ఉన్న చోట్ల కేటాయించేందుకు జర్నలిస్టుల అంగీకారం తీసుకోవాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులలో కొంతమంది వారి భాగస్వాముల పేరిట జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు ఇప్పటికే పొందిన కారణంతో అనర్హులయ్యారని, అట్టి వారికి మినహాయింపు ఇవ్వాలని కమిటీలో జర్నలిస్టు సభ్యులు కలెక్టర్‌ను కోరగా, ప్రభుత్వ నిబంధనల మేరకే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. సమావేశంలో డీఐపీఆర్వో ఎం.వెంకటేశ్వరప్రసాద్ , డీఆర్వో కె.చంద్రశేఖరరావు, బందరు, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం.వాణి, పద్మావతి, డి.రాజు, జర్నలిస్టు సభ్యులు ఎ.శేషుబాబు, కె.గణేష్ కుమార్, కె.సతీష్ పాల్గొన్నారు.

మెరిట్ టెస్టులో కోడూరు జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



విద్యాశాఖ కమిషనర్ నుంచి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కోడూరు: ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్టులో కోడూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 20 రోజుల నుంచి ఆన్‌లైన్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో జెడ్పీ పాఠశాలకు చెందిన ఆరిగే అఖిల్, యర్రారెడ్డి ఉజ్వల జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య వికాస కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ విద్యార్థులు అఖిల్, ఉజ్వలకు రూ.8వేలు, రూ.6వేల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, పీసీ కమిటీ చైర్మన్ గల్లా శ్రీనివాసరావు, ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన జూపూడి



చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు శనివారం కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబును కలిశారు. మచిలీపట్నంకు వచ్చిన ఆయన కలెక్టర్‌ను కలిసి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. క్షేత్రస్థాయిలో అర్హులైన వారికి పథకాలు అందేలా చూడాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వానికి కార్యదర్శుల కృతజ్ఞతలు

అవనిగడ్డ: గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంతో కార్యదర్శులు స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శనివారం వారు శాసనసభ్యుడు సింహాద్రిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీస్ వెల్ఫేర్ అండ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆది అశోక్‌తో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.